క్లుప్తంగా

బ్యాంకు సిబ్బంది తీరు మారాలి



బ్యాంకు ఎదుట నిరసన తెలుపుతున్న ఖాతాదారులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో ఉన్న ఇండియన్ బ్యాంకు సిబ్బంది తీరుపై పలువురు ఖాతాదారులు బుధవారం నిరసన తెలిపారు. బ్యాంకులో విధులు నిర్వహిస్తున్న పలువురు సిబ్బంది ఖాతాదారులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. జిల్లా ఉన్నతధికారులు స్పందించి ఖాతాదారులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ నాయకుడు షేక్అలీ, తదితరులు డిమాండ్ చేశారు.

మైనంపల్లికి ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

హవేళిఘణాపూర్(మెదక్): కాంగ్రెస్ పార్టీలో చేరి మొట్టమొదటిసారిగా మెదక్ మండలం మంభోజిపల్లికి చేరుకున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ఎంఎస్ఎస్ఓ చైర్మన్ మైనంపల్లి రోహిత్‌లకు కాంగ్రెస్ నాయకులు గజమాలతో ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గ పరిధిలోని ఆయా గ్రామాల నుంచి తరలివచ్చిన నాయకులు బైక్‌ల మీద ర్యాలీగా ఏడుపాయలకు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, మహేందర్‌రెడ్డి, నరేందర్, రాజిరెడ్డి, స్వామినాయక్, పరశురామ్ ఉన్నారు.

చదువుతోనే భవిష్యత్



అవగాహన కల్పిస్తున్న ట్రైనర్

టేక్మాల్(మెదక్): చదువుతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని ఇంఫాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్ నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రం టేక్మాల్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే లక్ష్యం, నిర్దేశంతో ముందుకు సాగాలన్నారు. విద్యా ప్రాధాన్యత, భవిష్యత్ నిర్మాణం వంటి అంశాలను వివరించారు. అనంతరం వక్త నరసింహారెడ్డిని పాఠశాల యాజమాన్యం సన్మానించారు. ఇందులో కళాశాల ప్రిన్సిపాల్ సుభాష్ చంద్రబోస్, అధ్యాపకులు రఘునాథ్, సంజీవ్, పరమేశ్, బాలేశ్వరమ్మ, అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు శివ్వంపేట విద్యార్థులు



జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొనే జిల్లా జట్టులో శివ్వంపేట గిరిజన బాలుర వసతిగృహం విద్యార్తులు ఎంపికైనారు. బుధవారం మెదక్ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థులకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడ జట్టులో శివ్వంపేట హాస్టల్‌కు చెందిన 15 మంది విద్యార్థులు ఎంపికైనట్లు హాస్టల్ వార్డెన్ దర్శన్ తెలిపారు. జిల్లా జట్టు తరుపున రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు చెప్పారు.

పాఠశాలలో మాక్‌పోలింగ్



మాక్‌పోలింగ్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

టేక్మాల్(మెదక్): మండల కేంద్రం టేక్మాల్ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు ఓటర్ ఎన్రోల్మెంట్‌లో భాగంగా బుధవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన మాక్ పోలింగ్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో ఉపాధ్యాయులు రజిత, హజ్‌గర్, దుర్గాప్రసాద్, వినయ్‌కుమార్, కుమార్‌గౌడ్, చాంద్‌పాషా, మొగులయ్య, వేణు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో గ్రామాలు

మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ సునీతారెడ్డి, నర్సాపూర్ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): సీఎం కేసీఆర్ కృషితో గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తున్నాయని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ సునీతారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని గోమారం గ్రామంలో అభివృద్ధి పనులను ప్రారంభించడంతో, పలు వాటికి శంకుస్థాపనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. అనంతరం చౌరస్తా నుంచి పోతులబోగూడ వరకు పాడైపోయిన సింగిల్ రోడ్డుని డబుల్ రోడ్డుగా మార్చేందుకు రూ.38 కోట్లు మంజూరైనట్లు అందుకు సంబంధించి పనులకు శంకుస్థాపన చేసిన విషయం గుర్తుచేశారు. డబుల్ రోడ్డు నిర్మాణంతో ప్రజల ఇబ్బందులు తొలగిపోనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జెడ్పీటీసీ పబ్బ మహేశ్ గుప్తా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, ఆత్మ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు లావణ్యరెడ్డి, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, ఎంపీటీసీ నర్సింహరెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు చేయూత

అన్ని వర్గాలకు ప్రభుత్వం చేయూతనిస్తుదని సునీతారెడ్డి, మదన్‌రెడ్డి అన్నారు. గోమారంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బతుకమ్మ చీరలు, యువకులు, విద్యార్థులకు క్రీడ సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లావణ్య, ఎంపీడీఓ భారతి, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

దారి తొలగించొద్దు



వినతిపత్రం ఇస్తున్న చండూర్ రైతులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): వ్యవసాయ పొలాలకు, బట్టిమ్మ ఆలయానికి ఎన్నో ఏళ్లుగా ఉన్న దారిని చాముండేశ్వరి ఆలయ నిర్వాహకులు తొలగించడం సరికాదని, ఆ దారిని తొలగిస్తే రైతులు ఇబ్బందులకు గురవుతారని చండూర్ గ్రామ రైతులు అన్నారు. బుధవారం పలువురు రైతులు దారిని తొలగించకుండా తమకు న్యాయం చేయాలని మండల కేంద్రం చిలప్‌చెడ్ తహసీల్దార్ ముసాద్దీక్‌కు వినతిపత్రం అందజేశారు. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని చిట్కుల్ శివారులోని చాముండేశ్వరి దేవస్థానానికి చెందిన కొంత భూమి మెదక్ - జోగిపేట ప్రధాన రహదారి పక్కనే ఉంది. కొంత కాలంగా ఈ భూమి అమ్మవారి జాతరల్లో వాహనాల పార్కింగ్‌కు వినియోగించేవారు. కొన్నేళ్లుగా ఈ భూమిలో నుంచే పలువురి రైతుల వ్యవసాయ పొలాలకు, బట్టిమ్మ ఆలయానికి మట్టి దారి ఉంది. ప్రస్తుతం ఆలయ నిర్వాహకులు ఆ భూమి సాగు చేసేందుకు చదును చేస్తున్నారు. దాంట్లో భాగంగా దారిని సైతం దున్నేస్తుండగా, సమాచారం తెలుసుకున్న చండూర్ గ్రామస్తులు ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి, న్యాయం చేయాలని కోరారు. నాయకులు కిషన్‌రెడ్డి, భీమయ్య, సంతోష్ కుమార్, రైతులు సత్యం, పాపయ్య, శ్రీశైలం, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై స్పందన

ప్రిన్సిపాల్ వివరణ కోరిన కోఆర్డినేటర్

సాక్షి ఎఫెక్ట్...

నర్సాపూర్: గురుకులంలో చెట్ల నరికివేతపై గిరిజన గురుకులాల రీజనల్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్ స్పందించారు. బుధవారం 'సాక్షి'లో వచ్చిన మైదానం అభివృద్ధి పేరుతో చెట్ల నరికివేత కథనంపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ... గురుకుల పాఠశాల, కాలేజీ కమిటీలో చర్చించిన అనంతరం తీసుకునే నిర్ణయాల మేరకు గురుకులంలో ఆయా పనులు చేపట్టాల్సి ఉంటుందని చెప్పారు. కమిటీలో చర్చించకుండా ఏ పనులు చేపట్టేందుకు వీలు లేనందున కమిటీ నిర్ణయం ఎందుకు తీసుకోలేదని ప్రిన్సిపాల్ భిక్షమయ్యను వివరణ కోరినట్లు వివరించారు. మైదానం చదును చేయడం, అభివృద్ధి చేయాల్సి వచ్చినా.. పెద్ద చెట్లు నరకడం సరికాదని తెలిపారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించండి



శివ్వంపేటలో భిక్షాటన చేస్తున్న ఆశా సిబ్బంది

రేగోడ్(మెదక్): ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎండి.సర్దార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రం రేగోడ్‌లో బుధవారం పదోరోజుకు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా భిక్షాటన చేసిన ఆశావర్కర్లకు సర్దార్ మద్దతు తెలిపారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలో ఆశా వర్కర్లు భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు.

కొడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలో ఆశా వర్కర్లు భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆశవర్కర్ల శ్యామల, సుగుణ, నీరజ, వసంత తదితరులు మాట్లాడారు.



రేగోడ్‌లో ఆశావర్కర్లకు మద్దతు తెలుపుతున్న సర్దార్

మెదక్ కలెక్టరేట్: కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు బుధవారం పట్టణంలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వరాజ్, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి సావిత్రి, స్వప్న, మంజుల, పద్మ, రాణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో తమ సమస్యలను పరిష్కరించాలని దీక్షలు చేపట్టిన ఆశ వర్కర్లు తహసీల్దార్ చంద్రశేకర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు నాగమణి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావుపై చర్యలు తీసుకోవాలి

పెద్దశంకరంపేట(మెదక్): సిద్దిపేటలో రైల్వే ప్రారంభోత్సవంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగిస్తున్న సమయంలో మంత్రి హరీశ్‌రావు టీవీని బూటుకాలుతో తన్నడం అవివేక చర్య అని బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మంత్రి తన హోదాను మరిచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై అనుచితంగా ప్రవర్తించడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ సంఘటనపై మంత్రి హరీశ్‌రావుపై చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

అంగన్‌వాడీల ముందస్తు అరెస్ట్



నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

నర్సాపూర్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తమ సమస్యల పరిష్కారం కోసం బుధవారం చలో హైదరాబాద్ చేపట్టారు. ఆ కార్యక్రమానికి వెళ్లకుండా నర్సాపూర్‌కు చెందిన సుమిత్ర, రజియా, భారతి, యాదమ్మ, దీవెనా, లింగమ్మలను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు.

'హామీల అమలులో బీఆర్ఎస్ విఫలం'



మాట్లాడుతున్న గాలి అనిల్‌కుమార్

నర్సాపూర్: ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీల అమలులో బీఆర్ఎస్ విఫలం చెందిందని తెలంగాణ పీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్ ఆరోపించారు. డబుల్ బెడ్రూం ఇళ్లు పేదలకు పంపిణీ చేయాలన్న డిమాండ్‌తో బుధవారం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఒకరోజు నిరహార దీక్ష చేశారు. చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన దీక్ష శిబిరంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సందీప్, యువజన కాంగ్రెస్ నాయకులు నరేశ్, ప్రసాద్, మహేశ్, ఇస్మాయిల్, అఫీజ్ తదితరులు దీక్షలో పాల్గొన్నారు. అనంతరం దీక్షలో పాల్గొన్న వారికి నిమ్మరసం తాగించి దీక్ష విరమింపచేశారు. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే హన్మంతారావు నర్సాపూర్ మీదుగా ఏడుపాయల వెళ్తూ దీక్ష శిబిరం వద్ద కొంతసేపు ఆగి దీక్షలో పాల్గొన్న యువజన కాంగ్రెస్ నాయకులకు సంఘీభావం తెలిపి వెళ్లారు.

ఈ పంచాయతీ ఆపరేటర్ల వినూత్న నిరసన



ముగ్గులు వేసి నిరసన తెలుపుతున్న ఆపరేటర్లు

మెదక్ కలెక్టరేట్: ఈ పంచాయతీ ఆపరేటర్లు కలెక్టరేట్ వద్ద చేపట్టిన శాంతియుత సమ్మె బుధవారం 6వ రోజు కొనసాగించారు. ఈ సందర్భంగా మహిళా ఆపరేటర్లు డిమాండ్లతో కూడిన ముగ్గులు వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ చంద్రశేఖర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, ముఖ్య సలహాదారు లక్ష్మణ్, శ్రీనివాస్, రామస్వామి, రవీందర్, రమేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధిలో కేంద్రం భాగస్వామ్యం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లి గోపి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ నాయకులు

నర్సాపూర్: రాష్ట్ర అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లి గోపి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలోని అన్ని రంగాల అభివృద్ధికి కేంద్రం తన వాటా కింద పెద్ద ఎత్తున నిధులు ఇస్తుందని, సిద్దిపేట మున్సిపాలిటీ అభివృద్ధికి కేంద్రం సుమారు రూ.ఎనిమిది వందల కోట్లు ఇచ్చిందని, కేంద్ర నిధులతో సిద్దిపేటను అభివృద్ధి చేసుకున్న మంత్రి హరీశ్‌రావు కేంద్రంపై ఆరోపణలు చేయడం తగదన్నారు. ఈనెల 3న నిజామాబాద్‌లో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్రమోదీ పలు అభివృద్ధి పనులను వర్చువల్‌గా ప్రారంభించారని వివరించారు. ప్రధాని రైల్వేలైన్‌ను ప్రారంభించగా సిద్దిపేటలో రైల్వే అధికారులు టీవీ ఏర్పాటు చేసి ప్రజలు చూసేందుకు అవకాశం కల్పించగా అక్కడికి వచ్చిన మంత్రి టీవీని కాలుతో తన్నడంతో పాటు ఫ్లెక్సీలో ప్రధాని ఫొటోను చింపివేయించడాన్ని ఆయన ఖండించారు. మండలంలోని అచ్చంపేటకు చెందిన పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు బీజేపీలో చేరారు. సమావేశంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, పార్టీ నాయకులు సురేశ్, మల్లేశ్‌గౌడ్, రఘువీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తాం

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి



ఆశా వర్కర్లతో మాట్లాడుతున్న రాజిరెడ్డి

కొడిపల్లి(నర్సాపూర్): కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆశవర్కర్ల సమస్యలను పరిష్కరిస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి చెప్పారు. బుధవారం కొడిపల్లి సీహెచ్‌సీ ఎదుట నిర్వహిస్తున్న ఆశావర్కర్ల సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, యూత్ అధ్యక్షుడు ధన్‌సింగ్, ప్రవీణ్ రెడ్డి, పాషా, శ్రీనివాస్‌గౌడ్, ఆశావర్కర్లు, నాయకులు పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలో ఆశా వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మెకు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి మద్దతు తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

శివ్వంపేట(నర్సాపూర్): విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. కొన్ని రోజుల నుంచి కురిసిన వర్షాలకు మండల పరిధిలోని కొంతన్‌పల్లి గ్రామంలోని వ్యవసాయ బోరుబావులకు విద్యుత్ సరఫరా చేసే ప్రధాన లైన్ విద్యుత్ స్తంభం నేలకు ఒరిగింది. వరిపంటలో స్తంభం ఉండడంతో పొలంలోకి వెళ్లలేని పరిస్థితి నెలకొందని రైతులు వాపోయారు. విద్యుత్ లైన్‌మెన్‌కు విషయం చెప్పినా.. పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపించారు. ఈ విషయం గురించి ట్రాన్స్ కో ఏఈ దుర్గప్రసాద్ వివరణ కోరగా.. ప్రమాదభరితంగా ఉన్న స్తంభాన్ని సరిచేస్తామని చెప్పారు.



నేలకొరిగిన విద్యుత్ స్తంభం

మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ



నర్సాపూర్‌లో బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



రామాయంపేటలో బాలికలకు క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న ఎంపీపీ, తదితరులు

నర్సాపూర్: పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షురాలు జ్యోతి అధ్యక్షతన బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, ఎంపీపీ అధ్యక్షురాలు జ్యోతి, జెడ్పీటీసీ బబియానాయక్, ఎంపీడీఓ మార్టిన్‌లూథర్, తహసీల్దార్ కమలాద్రి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ సిద్ధరాములు ఆధ్వర్యంలో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. అలాగే మండలంలోని 14 గ్రామ పంచాయతీల యువకులకు క్రికెట్, వాలీబాల్ కిట్టుతో కూడిన క్రీడా సామగ్రిని గ్రామ సర్పంచ్‌లకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జగదీశ్వర్ చారి, ఎంపీఓ రాజేందర్, సర్పంచ్‌లు అనూష, అరుణ్ కుమార్, ఎంపీటీసీ లహరిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కిష్టారెడ్డి, గ్రామ కార్యదర్శులు నర్సింలు, ఆరిఫ్ హుస్సేన్, ప్రశాంత్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

హవేళిఘనాపూర్(మెదక్): మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీపీ శేరి నారాయణరెడ్డి బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీరామ్, గ్రామ సర్పంచ్ సవిత, ఉపసర్పంచ్ మోహన్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలో బతుకమ్మ చీరలు, క్రీడా సామగ్రి పంపిణీ చేసిన వారిలో ఎంపీపీ మంజుల, జెడ్పీటీసీ మేఘమాల, మండల ప్రత్యేక అధికారి నాగరాజు, ఎంపీడీఓ గణేశ్, తహసీల్దార్ గఫర్ మియా, ఆయా గ్రామాల సర్పంచ్‌లు విష్ణువర్ధన్ రెడ్డి, కిష్టయ్య, గోదావరి, మండలాధ్యక్షుడు గౌరీ శంకర్‌గుప్తా పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలో బతుకమ్మ చీరలు, క్రీడా సామగ్రి పంపిణీ చేసిన వారిలో ఎంపీపీ రాజునాయక్, ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచ్‌లు వెంకటేశ్వర్‌రెడ్డి, నరహరి, శ్రీజ, బుజ్జి, నాయకులు రామాగౌడ్, శివాంజనేయులు, దూద్యనాయక్, మోహన్, సత్తయ్య, రాజు, గణేశ్, వాల్యానాయక్, సలీం, సర్దార్, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేట(మెదక్): రామాయంపేట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ భిక్షపతి, ఎంపీడీఓ ఉమాదేవి బతుకమ్మ చీరలతో పాటు క్రీడా సామగ్రి కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ గిరిజారాణి, ఎంపీటీసీలు నాగులు, మద్దూరి జ్యోతి, కోనాపూర్ సర్పంచ్ దోమ చంద్రకళ, ప్రగతి ధర్మారం మాజీ ఎంపీటీసీ సిద్ధరాంరెడ్డి, పీఈటీ భూదయ్య పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో బతుకమ్మ చీరలను పంపిణీ చేసిన వారిలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు యాదగిరి, కుమార్‌గౌడ్, సర్పంచ్‌లు లక్ష్మణ్, రమేశ్, దయానంద్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజు, స్వామి ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పెద్దశంకరంపేట(మెదక్): పోస్టల్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు ఒక రోజు సమ్మె నిర్వహించారు. బుధవారం తపాలా శాఖ ఉద్యోగులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వెంటనే కమలేష్‌చంద్ర సిఫారసులను అమలు చేయాలని, తపాలాశాఖ ఉద్యోగులకు 8 గంటల పని దినాలు కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీపీఎంలు మాణయ్య, గంగారం, రాఘువేంద్ర, నెహ్రూ, బీరప్ప, ప్రశాంత్, తుకారం, సవితతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బీఆర్ఎస్‌లో చేరికలు

మెదక్ మున్సిపాలిటీ: హవేళిఘనాపూర్ మండలంలోని బూర్గుపల్లికి చెందిన బీజేపీ, కాంగ్రెస్‌లకు చెందిన సిద్ధిరాములు, భూమయ్యలు బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి మెదక్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ లావణ్యారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, చాకలి బాలరాజు, సూర్యం పాల్గొన్నారు.

◆ గ్రామ పంచాయతీ నిర్మాణానికి భూమిపూజ

చేగుంట(తూప్రాన్): మండలంలోని చిన్నశివునూర్ గ్రామంలో బుధవారం సర్పంచ్ అశోక్ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ స్వామి, ఎంపీటీసీ శ్రీనివాస్, నాయకులు భుజంగం, సంతోష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కౌడిపల్లిలో ..

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలో నూతనంగా నిర్మించే గ్రామ పంచాయతీ భవనానికి బుధవారం మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జిల్లా రైతుబంధు సమితి సభ్యుడు శివాంజనేయులు, ఎంపీఓ కలీముల్ల, పీఆర్ ఏఈ ప్రభాకర్, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, ఎస్ఎంసీ చైర్మన్ జగన్, వార్డుసభ్యులు తిరుమలేశ్, కొమురమ్మ, నాయకులు పెంటాగౌడ్, కృష్ణ, శ్రీనివాస్, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

◆ పరామర్శ

హవేళిఘనాపూర్(మెదక్): మండలంలోని శమ్నాపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ కిషన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె రూ.25వేల ఆర్థికసాయం అందించారు. ఎమ్మెల్యే వెంట గ్రామ సర్పంచ్ లింగం ఉన్నారు.

◆ మట్టి తవ్వకాలు నిలిపివేయాలి

శివ్వంపేట(నర్సాపూర్): అసైన్డ్ భూముల్లో నుంచి ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. మండలంలోని నవాబుపేట గ్రామ పరిధిలో నిర్మాణం చేస్తున్న ఓ కెమికల్ పరిశ్రమలోకి అసైన్డ్ భూమిలో హిటాచి ద్వారా మట్టి తవ్వకాలు చేస్తున్నారు. మట్టి తవ్వకాలు చేస్తున్న వారిపై జిల్లా ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని సురేశ్‌గౌడ్, రాజు, మహేశ్ డిమాండ్ చేశారు.

◆ దాడులు చేస్తే ప్రతి దాడికి సిద్ధం

చిన్నశంకరంపేట(మెదక్): సిద్దిపేటలో రైలు ప్రారంభోత్సవం సందర్భంగా రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు బీజేపీ కార్యకర్తలపై దాడికి దిగారని, దాడులు చేస్తే ప్రతి దాడికి సిద్ధంగా ఉన్నామని మండలాధ్యక్షుడు పోగుల రాజు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జనగామ మల్లారెడ్డి హెచ్చరించారు. సమావేశంలో బీజేపీ మండల నాయకులు నర్సింలు, దశరథం, మధు, స్వామి, శ్రీను, వెంకటేశం పాల్గొన్నారు.

◆ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



టేక్మాల్(మెదక్): మండలంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నిమ్మరమేశ్ ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. మండల కోఆప్షన్ సభ్యులు మజహర్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సంగమేశ్వర్‌గౌడ్, నాయకులు కిషోర్, సాగర్, పాపయ్య, రాజుగౌడ్, సేవ్యానాయక్, లక్ష్మీనారాయణ, సాయిబాబా పాల్గొన్నారు.

◆ స్పోర్ట్స్ కిట్ పంపిణీ

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాలతో యువత క్రీడల కోసం ప్రభుత్వం పంపిణీ చేసిన స్పోర్ట్స్ కిట్‌ను గ్రామ పంచాయతీ యువకులకు అందజేశారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రాజునాయక్, ఎంపీడీఓ శ్రీనివాస్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రామాగౌడ్, నాయకులు శివాంజనేయులు స్పోర్ట్స్ కిట్‌ను అందించారు.

◆ కార్మికుల సభను విజయవంతం చేయాలి

మనోహరాబాద్(తూప్రాన్): పంచాయతీ కార్మికులు తమ సమస్యల పరిష్కరించడానికి ఈ నెల 5న హైదరాబాద్‌లో తలపెట్టే బహిరంగ సభను విజయవంతం చేయాలని పంచాయతీ కార్మికుల జిల్లా కార్యదర్శి ఆసిఫ్ పంచాయతీ కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.